# ఆకలి

ఆ రాత్రిని వర్ణించమని ప్రబంధకవి నడిగితే — 'దేశాంతర మేగిన భర్త ఎంతకాలమునకూ రాక, వంత జెందుతూ, నల్లచీర ధరించిన ప్రోషితభర్తృకవోలె నున్నది' — అంటాడు. ప్రసిద్ధవారపత్రికలలో సీరియల్ నవలలు రాసే ప్రముఖరచయిత్రి నడిగితే— అగ్నిసాక్షిగా వివాహ మాడిన దైవం తనని అపార్థం చేసుకొని, పాదాలచెంత యింత చోటివ్వడానికి కూడా నిరాకరించగా, ఆ వేదనతో కృంగి కృశించి నశిస్తున్న భారత స్త్రీ హృదయంలా అంధకార బంధురమైవున్నది- అంటుంది. వయసూ మనసూ మండుతున్న యివ్వాల్టి కవి నడిగితే-'బూర్జువాలు, భూస్వాములు, దొంగనాయకులు, వినాయకులూ పీడితప్రజల మొహాలపై కప్పిన బాధల, భయాల, కుట్రల, మోసాల ముసుగులా వుంది ఈ రాత్రి - అంటాడు.

ఎవ రేమంటేనేం, అది రాత్రి, చీకటిరాత్రి, ఎనిమిది గంటలవరకూ చీకటి పెరిగిన రాత్రి.

అది పల్లెటూరు గనుక, ప్రభుత్వం వారి 'గ్రామీణ విద్యుచ్ఛక్తి కార్యక్రమాలు' ఇంకా ఆ వూరిదాకా చేరలేదు గనుక - ఎనిమిది గంటల చీకటిరాత్రి ఆ వూరి సందులలో గొందులలో చీకటిగానే వుంది. రోడ్ల మరమ్మతులకని మంజూరు చేయించిన యాభై వేల రూపాయలూ పంచాయతీబోర్డు ప్రెసిడెంటు బందరు నేతిమిఠాయి తిన్నట్లు తినేశాడు గనుక - ఆ వూరి సందులూ గొందులూ గోతులు గోతులుగా - ఆ వేళ పగలే వానకురిసింది గనుక - బురద బురదగా వున్నాయి.

చీకటి చీకటిగా, గోతులు గోతులుగా, బురద బురదగా వున్న ఆ సందులలో గొందులలో - ఒకచేతిలో మట్టిదాక, మరోచేతిలో పుచ్చిపోయిన కర్ర పుచ్చుకుని, బురదలో జారిపడకుండా కర్ర గుచ్చి గుచ్చి నడుస్తూ, ప్రతియింటిగుమ్మం ముందూ ఆగి - 'మాదాకబళం. తల్లీ' - అని అరుస్తూన్నాడు. ఆ వూళ్ళో చాలాకాలంగా బిచ్చమెత్తుకు బతుకుతున్న నారిగాడు.

వాడి కేక చాలా మంది అమ్మలకీ తల్లులకీ వినిపించడం లేదు. చాలా మంది వినిపించుకోవడంలేదు. వినిపించుకున్న వాళ్ళలో - కొందరు లేదు పొమ్మంటున్నారు; కొందరు చెయ్యూర్యారుకోలేదు, పొమ్మంటున్నారు, కొందరు భోజనాలైపోయాయి, ఏం మిగలలేదంటున్నారు; కొందరింకా భోజ

నాలుకా లేదు, మళ్ళీ రమ్మంటున్నారు, కసిరేవాళ్ళుకొందరు, కరిచేవాళ్ళు కొందరు, విదిలించేవాళ్ళు కొందరు, విసిరికొట్టే వాళ్ళు కొందరు !

నారిగాడు తిరిగాడు, తిరిగాడు ఆశ చావక, ఆకలి చావక ఎనిమిదిన్నర, తొమ్మిది, తొమ్మిన్నరదాకా తిరిగాడు ఆ వూళ్ళో యిల్లాళ్ళందర్నీ అన్నపూర్ణలన్నాడు, లక్ష్మిదేవు లన్నాడు, పిల్లల్లేనివాళ్ళకి పండంటి బిడ్డలు యింటినిండా తిరుగుతారన్నాడు, పిల్లలున్నవాళ్ళకి కోడళ్ళొస్తారన్నాడు, అల్లుళ్ళొస్తారన్నాడు, నిన్నటినుంచీ తిండి లేదన్నాడు, ఆకలి మండిపోతోందన్నాడు, చచ్చిపోతున్నానన్నాడు, చచ్చి మీ కడుపున పుడతానన్నాడు, చేతులెత్తి మొక్కాడు, వేడుకున్నాడు, ఏడిచాడు, 'మాదాకబళ్ళం తల్లీ' - అని అరిచాడు, అరిచాడు - అరవలేనంతవరకూ అరిచాడు, తిరగలేనంత వరకూ తిరిగాడు.

కాని- పాచిపోయిన అన్నం మెతుకులో గుప్పెడూ, చద్దికంపుకొట్టే పచ్చడేదో పిసరంతా తప్పితే ఆ పూట నారిగాడికి మరేం దొరికి లేదు. అన్నం పెట్టని వాళ్ళని తిట్టుకుంటూ, దేవుణ్ణి తిట్టుకుంటూ, తనని తాను తిట్టుకుంటూ- మండుతున్న కడుపుతో తడబడుతున్న కాళ్ళతో మెల్లగా వెళ్ళి, చెరువుగట్టున పాకలో కూలబడ్డాడు నారిగాడు.

ఆ పాక శిథిలావస్థలో వుంది. పాకముందున్న గాంధీగారి విగ్రహానికి ఒక చెయ్యి విరిగిపోయి వుంది కాలు యివ్వాళో రేపో విరిగిపోడానికి సిద్ధంగా వుంది. ఊళ్ళో

మగాళ్ళు తీరిగ్గా వున్నప్పుడు కూచోడానికని ఆ పాక వేశారు. కాని యిప్పుడది బిచ్చగాళ్ళకీ, దొంగచాటుగా సిగరెట్లు కాల్చే స్కూలు కుర్రాళ్ళకీ, జూదగాళ్ళకి మాత్రమే ఉపయోగపడుతోంది, ఆ పాక స్థానంలో మంచి పెంకుటిషెడ్ వేయించడానికని మంజూరైన యిరవై వేల రూపాయల్లో- సగం మాత్రమే తను తిని, మిగతా సగమూ మిగతా మెంబర్లకి పంచాడు. పంచాయతీబోర్డు ప్రెసిడెంటు!

ఆ చద్ది పచ్చడే కలుపుకుని, ఆ పాచి పోయిన మెతుకులే తిన్నాడు నారిగాడు. ఆకలి ఆవగింజంతయినా తీరలేదు. చెరువులో కెళ్ళి కడుపునిండా నీళ్ళు తాగాడు. మళ్ళీవచ్చి పాకలో కూర్చున్నాడు.

చీకటి చిక్కబడింది ఊరంతా నిద్రపోతోంది. నారిగాడుమాత్రం నిద్ర రాక, ముసురుతున్న ఆలోచనల్నీ దోమల్నీ వదిలించుకోలేక, పాకలో ఒక మూల చింకి దుప్పటిమీద దొర్లుతున్నాడు.

రాత్రికి నడివయస్సొచ్చింది. చీకటి పూర్తిగా నలుపెక్కి, నిండుగా బలిసి, అంతటా నిండింది. కాటిక లాంటి ఆ చీకటిలో కన్ను పొడుచుకున్నా ఏమీ కనబడ్డం లేదు. కీచురాళ్ళ కూతలు తప్ప మరేం వినబడ్డంలేదు.

ఆ చీకటిలో, ఆ నిశ్శబ్దంలో-గాంధీగారి విగ్రహానికవతల, రేవుదగ్గరలో బురదలో దబదబా వినిపించిన అడు

గుల చప్పుడేమిటో నారిగాడి కర్థంకాలేదు. చెవులు రిక్కించుకుని విన్నాడు.

ఒకరు కాదు. ఐదారుగురు మనుషులు గబ గబా, గజిబిజిగా, ఖంగారుగా నడుస్తున్న చప్పుడు... ఆ చప్పుడు కాస్సేపు ఆగిపోయింది. అ తరువాత యిద్దరో ముగ్గురో చెరువులో దిగిన చప్పుడు... బరువైన వస్తువేదో చెరువులో పడేసిన చప్పుడు...నీళ్ళ చప్పుడు... నీళ్ళ అడుగునుంచి వస్తున్న బుడగల చప్పుడు...

నారిగాడి గుండె దడ దడ లాడింది, ఊపిరి బిగబట్టి కూర్చున్నాడు.

చెరువు వొడ్డునుంచి మళ్ళీ తిరుగొస్తున్న పాదాల చప్పుడు...గబగబా, ఖంగారుగా నడుస్తున్న పాదాల చప్పుడు...

దోమ ముక్కులో దూరి నారిగాడికి తుమ్మొచ్చింది. ఎంత ఆపుదామనుకున్నా ఆగలేదు. తుమ్మేశాడు. పాదాల చప్పుడు ఆగిపోయింది. ఎవర్రా అక్కడ?- చీకటిలోంచి బండగా వున్న ఒక గొంతు అడిగింది. నారిగాడు మాట్లాడలేదు. రెండు పాదాలు బలంగా అడుగులేస్తూ తన వేపు... పాకలోకి వస్తున్నచప్పుడు... లీలగా ఒక మనిషి ఆకారం... నారిగాడి మొహాన టార్చిలైటు వెలిగింది. కళ్ళు మిరుమిటుగా గొలిపి గట్టిగా మూసుకున్నాడు. లైటారిపోయింది. 'నువ్వేం జేత్తన్నావురా యిక్కడ?' మళ్ళా ఆ బండ గొంతే గర్జించింది.

నారిగాడు వణికిపోతూ- 'ఏం లేదు దొరా ... ఏం లేదు...ఇక్కడ పడుకున్నాను'-అన్నాడు.

"ఏం చూశావ్?" మళ్ళా ఓ గద్దింపు.

"ఏం లేదుదొరా ... ఏం లేదు ... నేనేం సూళ్ళేదు"

రేపొద్దున ఎక్కడైనా ఏమైనా కూశావంటే నీ ప్రాణం దక్కదు జాగ్రత్త... పాదాలన్నీ మళ్ళీ కదిలి గబ గబా నడుస్తూన్న చప్పుడు... దూరంగా వెళ్ళిపోయిన చప్పుడు.

ఆ చప్పుడు ఆగిపోయాకగాని నారిగాడి ప్రాణం కుదుటబడలేదు. జరిగిం దేమిటో కొంత అర్థమైంది. ఆ బండగొంతు ఎవరిదో గుర్తుపట్టాడు. ఆ వూరి మున్సబు రాఘవయ్య గొంతది. చెయ్యీకాలూ సరిగావున్నరోజుల్లో మున్సబుగారి గొడ్లచావిట్లో కొంతకాలం పని చేశాడు నారిగాడు.

○ ○ ○

తెల్లవారింది. కావిళ్ళేసుకుని నీళ్ళకోస మొచ్చిన వాళ్ళు- చెరువులో తేల్తున్న శవం చూచి బయటికి లాగారు. చినపార్టీలో ముఖ్యుడైన రంగారావు శవమది ఆ వూళ్ళో రెండే పార్టీలున్నాయి- పెదపార్టీ- చినపార్టీ అని. పెదపార్టీకి మున్సబు రాఘవయ్య నాయకుడు. మున్సబుకి కంటకంగా తయారయ్యేడు రంగారావు, కంటకాల్నీ,

కంటిలో నలుసుల్ని ఎలా తీసిపారెయ్యాలో మున్సబుకి బాగా తెలుసు.

రంగారావు ఎలా చచ్చిపోయాడో వూళ్ళో వాళ్ళకి తెలీదు ఇదేదో పెదపార్టీవాళ్ళే చేయించి వుంటారని అనుమానించినా ఆధారాలేమీ దొరక్క పైకి ఏమీ అనలేకపోయారు చినపార్టీవాళ్ళు, పోలీసు కి తెలిస్తే అవసరవు కేసులూ గొడవలూ జరుగుతాయని జడిసి తొందర తొందరగా శవానికి అంత్యక్రియలు జరిపించేశారు రంగారావు బంధువులు.

రంగారావు చావుగురించి వూరంతా గగ్గోలుగా వుంది. వదంతులు... రకరకాల వ్యాఖ్యానాలు...ఊహాగానాలు...కథలు...పొద్దుమూరెడెక్కి, బారెడెక్కి యింకా పైకెక్కి నడినెత్తిమీద కొచ్చింది. నారిగాడుమాత్రం పాకలో అలాగే కూర్చున్నాడు. రాత్రి జరిగిన సంఘటన... గొంతులో...బయటికి కక్కాలేని మింగాలేని రహస్యం... గుండెలో నిప్పులా రాజుకుంటున్న నిజం... ఏమీ చెయ్యలేని స్థితి...మనసునిండా ఏదో భయం ... దిగులు ... బ్రతుకుమీద విరక్తి .. మనుషుల మీద కోపం.. అసహ్యము. రాత్రికూడా కడుపు నిండకపోయినా, కడుపు నిండా తిని రెండు రోజులైనా, బిచ్చానికి బయల్దేర బుద్ధి కాలేదు నారిగాడికి.

సాయంత్రమైంది. మళ్ళా రాత్రి వచ్చింది. మళ్ళీ చీకటి పడింది... చీకటి మళ్లీ పెరుగుతోంది... నారిగాడింక

ఆకలిబాధకి తట్టుకోలేకపోయాడు, అడుక్కోటానికి బయల్దేరాడు.

చీకటి చీకటిగా, గోతులు గోతులుగా, బురద బురదగా వున్న సందుల్లో గొందుల్లో ప్రతి యింటిముందూ ఆగి "మాదాకబళం తల్లీ" అని అరుస్తూ మళ్ళీ వోపిక వున్నంత వరకూ తిరిగాడు. ఇవ్వాళకూడా ఏ తల్లీ దయదల్చలేదు. నారిగాడు మున్సబు యింటిముందు కొచ్చాడు. అలవాటు ప్రకారం అరవబోయి మానేశాడు. "ఛీ! సావసన్నా సత్తాగాని, ఈ యింటి కూడు తినకూడదు, తినకూడ"దనుకున్నాడు. ముందుకెళ్ళిపోయి పక్కయింటి గుమ్మంముందాగి "మాదాకబళం తల్లీ"- అని అరిచాడు. ఆ తలుపు తెరుచుకోలేదుగాని మున్సబు యింటి తలుపు తెరుచుకుంది. నౌకరు బయటకొచ్చి-'నారిగా' అని పిలిచాడు. నారిగాడు వినిపించుకోనట్టుగా అక్కడ నిలబడ్డాడు. నౌకరు మళ్ళీ పిలిచాడు. నారిగాడికి వెళ్ళకతప్పిందికాదు. నౌకరు గిన్నెడన్నమూ, కూరా, పచ్చడీ నారిగాడు దాకలో కుమ్మరించాడు. దాక నిండిపోయింది. ఇంకేయింటికీ వెళ్ళకుండా చెరువుగట్టుమీద పాకలో కొచ్చేశాడు.

ఆకలిబాధ విపరీతంగా వుంది. అయినా మున్సబుగారింటో పెట్టిన అన్నం తినబుద్ధికాలేదునారిగాడికి. "తినకపోతే సచ్చిపోతానేమో"-అనుకున్నాడు. సచ్చినాసరే ఈ కూడుమాత్రం తినకూడదనుకున్నాడు. మళ్ళీ దాకలో వున్న

అన్నమంతా పాకముందు కుమ్మరించేశాడు. లోపలికెళ్ళి ముసుగెట్టి కూర్చున్నాడు.

ఆకలితో పేగులు లుంగలు చుట్టుకుపోతున్నాయి. సత్తువలేక నరాలు లాగుతున్నాయి నోరు పిడచకట్టుక పోయినట్టనిపించింది. మెల్లగా లేచి వెళ్ళి రేవులో దిగాడు. నీళ్ళు నోట్లో పోసుకుంటే పళ్ళు జివ్వున లాగాయి. ఆ చల్లదనం భరించలేక రెండుగుక్కలు తాగి వచ్చేశాడు. మళ్ళీ పాకలో కొచ్చి కూర్చున్నాడు. తాగిననీళ్ళు ఖాళీగా వున్న పొట్టలో చల్లగా మండి, ఆకలిమంట యింకా పెంచినట్టనిపించింది. గాలి చలిగావుంది. చలిగాలితో పాటు పారేసిన కూరవాసన... ఆ వాసనకి ఆకలి మరీ ఎక్కువైనట్టనిపించింది. నారిగాడు మనస్సులోనే తర్కించుకున్నాడు- "ఒక్క మున్సబన్న మాటేంటి. ఈ లోకంలో ఎంతమంది ఎన్నెన్ని గోరాలు సెయ్యటంలేదు? పాపం సెయ్యనోడెవడు? ఇంతకంటే ఎక్కువ కూనీలు సేసినోళ్ళెందరు లేరు! మునసబు కూని సేశాడని, ఆయన పెట్టిన కూడు తినకుండా కూకుంటే ఎవడికి నష్టం? నాకే... కూడు లేకపోతే నేనే సత్తాను... ఎవడెట్టా సత్తే నాకెందుకు... ఎవడి పాపాన ఆడే బోతాడు...బతికిననాల్రోజులూ కళ్ళుమూసుకుని పొట్ట గడుపుకుంటే సాలు... అన్నంకోసం పుట్టిన జీవుడిది. అన్నం కంటే ఎక్కువేంటుంది..."- అనుకున్నాడు.

93 to 96

page missing

93 to 96

page missing

గబగబా లేచివెళ్ళి పాకముందు పారేసిన అన్నమూ, కూరా, పచ్చడీ పైపైన దాకలో కెత్తుకున్నాడు. లోపలి కొచ్చి కూర్చుని, ఆవురావురుమంటూ తినేశాడు. కడుపు నిండింది. చింకి దుప్పటి ముసుగెట్టుకు పడుకున్నాడు. "కూర కమ్మగా వుంది. రేపుకూడ మున్సబుగారింటో కూరా పచ్చడి అడుక్కోవాలి"- అనుకుంటూ, ఆవులించి కళ్ళు మూసుకున్నాడు. ఆ మూసుకున్న కళ్ళు మళ్ళీ తెరుచుకోనే లేదు.